క్లుప్తంగా

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: మండల పరిధిలోని గడివేములలో వెలసిన మూలపెద్ద అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర విశేషపూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు అందజేశారు.

బ్రాహ్మణదొడ్డిలో ప్రాథమిక తనిఖీ

సి.బెళగల్: మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామ ప్రాథమిక పాఠశాలను మంగళవారం మండల ప్రత్యేకాధికారిని, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల నిర్వహణపై ఉపాధ్యాయులతో చర్చించారు. మధ్యాహ్న భోజన వసతి, సౌకర్యాలపై డీడీ ఆరా తీశారు.

మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రఘురామిరెడ్డి

పాణ్యం: ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం విద్యార్థులకు వడ్డించాలని సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి రఘురామిరెడ్డి సూచించారు. మండల కేంద్రం పాణ్యం జెడ్పీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అదే విధంగా నెరవాడ సమీపంలోని కేశవరెడ్డి హై స్కూల్‌ను పరిశీలించారు. ఆయా పాఠశాలలో విద్యార్థుల డ్రాపౌట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం మేరీ సునీత, డీటీపీ శేషు, సీఆర్పీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి మూలవిరాట్

కర్నూల్(రూరల్): మండల పరిధిలో గార్గేయపురంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. విద్యుత్ బల్బులు అలంకరించారు. బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి సీతారామిరెడ్డి, పాలక మండలి కమిటీ చైర్మన్ వజ్జల రామకృష్ణ యాదవ్ తెలిపారు. 11వ తేదీ ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని వారు తెలిపారు. 12న హనుమంతోత్సవం, 13న గరుడోత్సవం, 14న ప్రభోత్సవం కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేవిధంగా 15వ తేదీన సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా సాగుతుందన్నారు. 16న పారువేట ఉంటుందన్నారు. 17వ తేదీన వసంతోత్సవం, తిరునాల కార్యక్రమాలు ఉంటాయని వారు వివరించారు.

నేడు సామాజిక తనిఖీపై బహిరంగ వేదిక

సి.బెళగల్: మండలంలో ఉపాధిహామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీపై బుధవారం బహిరంగ వేదికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీలలో పంచాయతీరాజ్, ఉపాధిహామి పథకాలలో భాగంగా చేపట్టిన 964 పనులకు దాదాపు రూ.15.90 కోట్ల ఖర్చులపై సమాజిక తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో బహిరంగ వేదికను నిర్వహిస్తున్నామని వివరించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయి

కర్నూలు(రూరల్): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలు చేపడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి తెలిపారు. సీపీఎం కర్నూలు మండల మూడవ మహాసభలు మంగళవారం వసంత్‌నగర్‌లో మండల నాయకులు బీసన్న, బాలపీర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ నిర్మాణంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఉల్చాల గ్రామానికి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కేవీ నారయణ, ఆంజనేయులు, పీడీ హుసేనయ్య, రాఘవేంద్ర, శ్రీరాములు, నాగేష్, నరసింహ, వెంకటేశ్వర్లు, మృత్యుంజయుడు తదియితరులు పాల్గొన్నారు.

ఎరువు... బరువే!

- బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకు పెంపు
- పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్న రైతులు
- మండలంలో 18 వేల ఎకరాలలో రబీలో సాగు



బూజునూరు గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంట



రబీ సీజన్‌లో వరి నాటేందుకు సిద్ధం చేసిన నారుమడి

గడివేముల: ప్రస్తుత పరిస్థితుల్లో సాగు భారంగా మారింది. అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారుతోంది. సేద్యపు ఖర్చులే భారంగా మారిన నేపథ్యంలో ఎరువుల ధరలకు రెక్కలు రావడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఏటేటా ప్రభుత్వం అందజేసే పెట్టు బడి సాయం అటకెక్కింది. ఏకంగా రూ. 20 వేలు అందజేస్తామన్న కూటమి ప్రభుత్వ పెద్దలు ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో అన్నదాత నిరాశకు గురవుతున్నాడు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల మూలంగా దిగుబడులు తగ్గాయి. అరకొర దిగుబడులకు సైతం గిట్టుబాటు లేక దిగాలు పడుతున్న పుడమిపుత్రులకు ఎరువుల ధరల పెరుగుదల నెత్తిన పిడుగు పడినట్టయ్యింది. అయినా కష్టాలకు ఎదురీదుతూ ఈ ఏడాది రబీ సీజన్‌లోనూ పంటలు సాగు చేశారు. గోనెగండ్ల మండలంలో 18 వేల ఎకరాలు సాగు అయ్యింది. కంది, మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, పప్పు శనగ, ఆముదం తదితర పంటలు సాగు చేశారు. వరి మాత్రం సాగు కావాల్సి ఉంది. అయితే రైతులు ఎక్కువగా వినియోగించే కాంప్లెక్స్ ఎరువులు భారంగా మారాయి. ఒక్కో రకం బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకు పెరిగాయి. దీంతో ఎరువు కొనడం బరువే అంటూ నిట్టూర్చుతున్నాడు అన్నదాత.

అవసరం ఎక్కువ.. వినియోగం తక్కువ

ఏ పంటకైనా సమతూల్యంగా ఎరువులు వేస్తేనే ఆశించిన దిగుబడులు వస్తాయి. ధరలు పెరగడంతో నత్రజని అందించే యూరియా అధిక మోతాదులో వాడుతూ డీఏపీ, ఎంఓపీ వంటి కాంప్లెక్స్‌ను బాగా తగ్గించేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలోని వరి పంటకు డీఏపీ 52 కిలోలు వేయాల్సి ఉండగా 25 కిలోలే వినియోగిస్తున్నారు. ఎంఓపీ 33 కిలోలకు 15 కేజీలు వాడుతున్నారు. యూరియా 75 కిలోలకుగాను ఏకంగా 150 కిలోల వరకు వినియోగిస్తున్నారు. యూరియా ధర తక్కువగా ఉండడంతో అధికంగా వాడుతున్నట్లు రైతులు పేర్కొన్నారు.

గతంలో బయటి మార్కెట్ కంటే తక్కువ ధరలకు ఎరువులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఆర్బీకేల ద్వారా బయటి మార్కెట్ కంటే తక్కువ ధరలకు అన్నదాతలకు ఎరువులు అందించేవారు. రైతుకు కావాల్సిన ఎరువులను ఆయా గ్రామాల్లోని ఆర్బీకే కేంద్రాల్లో కియోస్క్ మిషన్‌లో నమోదు చేసుకొనే అవకాశం ఉండేది. నమోదు చేసుకున్న ఒకటి రెండు రోజుల్లోనే ఎరువులు వచ్చేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కియోస్క్ మిషన్లు మూలన పడేసిన సంగతి తెలిసిందే. రైతుభరోసా కేంద్రాల పేరు మార్చేసిన కూటమి సర్కార్ సేవలను పూర్తిగా తగ్గించిందని రైతులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

ఎరువు పేరు	పాత ధర	పెరిగిన ధర (రూపాయలు)
15-15-15	1,150	1,450
20-20-13	1,200	1,300
28-28-28-	1,600	1,700
24-24-0	1,700	1,800
డీఏపీ	1,200	1,350
10-26-26	1,300	1,470

అరకొరగా రైతుసేవా కేంద్రాలలో ఎరువులను అందుబాటులో ఉంచుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవేళ పేర్లు నమోదు చేసుకున్నా ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియన పరిస్థితి నెలకొందని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రైతులపై మోయలేని భారం



నాకు ఉన్న 8 ఎకరాలతో పాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. మినుము, జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేశా. రైతులు వాతావరణ ప్రతికూల పరిస్థితుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తరుణంలో కంపెనీలు ఇష్టానుసారంగా ఎరువుల ధరలకు పెంచుతున్నాయి. రైతులపై మోయలేని భారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను నియంత్రించాలి. అప్పుడే సాగు ముందుకు సాగుతుంది. -చిన్న షాలు, బూజునూరు

సబ్సిడీపై సరఫరా చేయాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను సబ్సిడీపై సరఫరా చేయాలి. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకునేందుకు పెట్టుబడి పెట్టే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో రైతాంగ ఇబ్బందులు గుర్తించి, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు సబ్సిడీపై సరఫరా చేయాలి. రైతులకు ప్రభుత్వం అండగా నిలువాలి. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడిసాయం రూ.20 వేలు వెంటనే మంజూరు చేయాలి. - శివుడు, గడిగరేవుల

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ప్రభుత్వ సూచించిన ధర కంటే అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. మండలంలోని రైతు సేవా కేంద్రాలలో యూరియా, డీఏపీ అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన రైతులు తమ పేర్లను ముందుగానే రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. వ్యవసాయాధికారులు సూచించిన ప్రకారం రైతులు ఎరువులను వినియోగించుకోవాలన్నారు. - హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్) : జిల్లా కేంద్రం కర్నూలు సమీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకు పూజ తదితర పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

రేపటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణా తరగతులు

ఓర్వకల్లు: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులకు ఈ నెల 12 నుంచి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 12,13 తేదీలలో మొదటి విడత, 17,18 తేదీలలో రెండవ విడత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సర్పంచ్‌లు, అధికారులు, సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన తేదీలలో జరిగే శిక్షణ తరగతులకు హాజరు కావాలని సూచించారు.

యాపర్లపాడులో పర్యటించిన ఎంపీడీఓ

కల్లూరు: మండల పరిధిలోని యాపర్లపాడు గ్రామంలో మంగళవారం ఎంపీడీఓ నాగశేషాచల రెడ్డి అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కొత్త బోరు వేయించాలని ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. తాగునీరు సమస్య, పైపులైన్ లీకేజీ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణన పకడ్బందీగా చేపట్టాలి



బ్రాహ్మణదొడ్డి రైతుసేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ శివకుమార్

సి.బెళగల్: పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పశు గణను అధికారులు, ఉద్యోగులు పకడ్బందీగా చేపట్టాలని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివకుమార్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని ఇనగండ్ల, పోలకల్, బ్రాహ్మణదొడ్డి గ్రామంలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న పశుగణను పరిశీలించారు. అదేవిధంగా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. సచివాలయ పశు సహాయకుల రికార్డులను, మందుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 50 శాతం పశు గణన పూర్తి అయ్యిందని, పాడి రైతులు పశుగణనకు సహకరించాలన్నారు. ఆయన వెంట పోలకల్ పశువైద్యులు రోనాల్డ్ రీచర్డ్స్, ఆయా గ్రామాల సచివాలయ పశు సహాయకులు ఉన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



వర్కూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్ : వలసల నివారణలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద కల్పిస్తున్న పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. మండలంలోని వర్కూరు, పులకుర్తి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఏపీఓ తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే ఉపాధి పథకం కింద కల్పిస్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారీ వేతనం రూ.300 వరకు వస్తుందని చెప్పారు. టెక్నికల్ సిబ్బంది కొలతల మేరకు పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు. కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఏపీఓ సిబ్బందిని ఆదేశించారు.

యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడులు



పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

పాణ్యం: యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చునని నంద్యాల జిల్లా ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని కొలూరు, బలపనూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఏడీఏ హాజరయ్యారు. వ్యవసాయ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో జొన్న పైరును ఏడీఏ పరిశీలించారు. పైరులో కత్తెర పురుగ ఉధృతి ఎక్కువగా ఉందని, వ్యవసాయ అధికారులు సూచించిన రసాయన మందులు పిచికారీ చేయాలని సూచించారు. తదుపరి ఎన్‌పీఎస్ఎస్ (నేషనల్ పెస్ట్ సర్వేలైన్స్ సిస్టమ్) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, తమ పైరులో ఉన్నటువంటి పురుగుల నిర్ధారణ, నివారణ చర్యల గురించి తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ డాక్టర్ జయప్రకాష్‌రెడ్డి, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పుల్లయ్య, వీఏఏ సురేంద్ర,రైతులు పాల్గొన్నారు.

ఈ.. పంట నమోదు చేసుకోండి

గడివేముల: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రం గడివేములతోపాటు మంచాలకట్ట గ్రామంలో మంగళవారం ఏఓ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో సాగు చేసిన జొన్న, మినుము, పొగాకు, మొక్కజొన్నలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అదే విధంగా వేరుశనగ, ఉల్లి, జొన్న, మినుము, వరి, శనగ పంటలకు సంబంధించి రైతులు బీమా ప్రీమియం ఈ నెల 15వ తేదీలోపు స్వయంగా చెల్లించాలని సూచించారు.

15లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

సి.బెళగల్: రబీ సీజన్‌లో భాగంగా పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 15వ తేదీలోగా బీమా ప్రీమియం చెల్లించి వివరాలను నమోదు చేయించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన వ్యవసాయ సిబ్బందితో కలిసి మండలంలోని కొండాపురం, ముడుమాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ సచివాలయాల్లో రైతులతో సమావేశమయ్యారు. పంటల సంరక్షణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, విత్తనోత్పత్తి తీరును ఏఓ రైతులకు వివరించారు. అనంతరం ఆయన ఆయా ఆర్‌ఎస్‌కేల పరిధిలో భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు ధృవ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, రైతులు పాల్గొన్నారు.

పంట కోతలు వాయిదా వేసుకోవాలి



పొగాకును పరిశీలిస్తున్న ఏఓ రూఫస్ రోనాల్డ్

కర్నూలు(రూరల్): తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి, పొగాకు, కంది పంటల కోతలను వాయిదా వేసుకోవాలని ఏఓ రూఫస్ రొనాల్డ్ సూచించారు. మండల పరిధిలోని గార్గేయపురంలో మంగళవారం ఏఓ పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకును పరిశీంచారు. అల్పపీడనం మూలంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దిగుబడులు తడవకుండా టార్పాలిన్‌లను కప్పాలని సూచించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న సివిల్‌సప్లై డివిజనల్ మేనేజర్ నాగసుధ

కర్నూలు(రూరల్): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సూచించారు. మండల పరిధిలోని పూడూరు గ్రామంలో మంగళవారం తహసీల్దార్ వెంకటలక్ష్మి నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు జేసీ హాజరయ్యారు. రైతుల నుంచి స్వయంగా వినతులు స్వీకరించారు. గ్రామంలో 223 డి.సర్వే నంబర్‌లో గతంలో అసైన్డ్ భూమి పట్టాలు ఇచ్చారని, ఇంతవరకు భూమి చూపలేదని కొందరు బాధితులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా తమకు భూములు చూపించాలని కోరుతూ సవరన్న, బిసన్న వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన జేసీ రికార్డులు పరిశీలించి భూమి హద్దులు చూపించాలని సర్వేయర్‌ను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో అందజేసిన ప్రతి వినతికి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని అధికారులను జేసీ ఆదేశించారు. 15 మంది రైతులు వివిధ సమస్యలపై వినతులు అందజేశారని తహసీల్దార్ తెలిపారు.

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో మంగళవారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు చక్కటి అవకాశమని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంఓల డీటీ శివశంకర్‌రెడ్డి, ఆర్ఐ రామ్, అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

ఓర్వకల్లు: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు అధికారులను కోరారు. మండల కేంద్రం ఓర్వకల్లులో మంగళవారం తహసీల్దార్ విద్యాసాగర్ నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన జెడ్పీటీసీ మాట్లాడారు. ఓర్వకల్లు ప్రాంతాన్ని పరిశ్రమల హబ్‌గా పరిగణించిన నేపథ్యంలో జాతీయ రహదారి పొడవున వున్న భూములకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో రైతులు రెవెన్యూ పరమైన సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే పేద, మధ్య తరగతి రైతులు ఏళ్ల తరబడి సాగులో వున్న ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్ కుందూవాగు ప్రక్కన్న ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించారు. విచారణ జరుపుతామని తెలిపారు. అలాగే ఉర్దూ యూనివర్సిటీకి జాతీయ రహదారి నుంచి 60 అడుగుల అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. రైతుల నుంచి 56 వినతులు స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, గంగీశ్వరరెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

కల్లూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సివిల్ సప్లై డివిజనల్ మేనేజర్, మండల నోడల్ ఆఫీసర్ నాగసుధ సూచించారు. మండల పరిధిలోని పర్ల గ్రామంలో మంగళవారం తహసీల్దార్ ఆంజనేయులు నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరయ్యారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఇచ్చిన ప్రతి అర్జీని పరిష్కారిస్తామన్నారు. 66 మంది అర్జీలు అందజేశారని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమక్క, ఎంపీటీసీ శేషన్న, మండల సర్వేయర్ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో మంగళవారం తహసీల్దార్ వెంకటరమణ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 32 మంది రైతులు వివిధ సమస్యలపై వినతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీఎస్ రామ్మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్,ఆర్ఐ వెంకటసుబ్బయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న డీడీ శ్యామల

సి.బెళగల్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల సూచించారు. మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామ సచివాలయంలో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డీడీ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. రైతుల వినతులను పరిశీలించి నిర్ణీత గడవులోపు పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా డీడీ రెవెన్యూ అధికారులకు సూచించారు. అయితే 11 గంటల అనంతరం సదస్సు బోసిపోయింది. దీంతో అధికారులు ఏమి తోచక వృద్ధులను పిలుపించుకుని సదస్సును ముగించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ సీతరామిరెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగ భూషణం, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు

కోడుమూరు రూరల్: రెవెన్యూ సదస్సుల్లో రైతులు అందజేసిన వినతులను పరిశీలించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. మండలంలోని గోరంట్ల గ్రామంలో తహసీల్దార్ వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హాజరయ్యారు. రైతుల వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వినతికి నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. 36మంది రైతులు వివిధ భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలకృష్ణ, ఏడీఏ సాలురెడ్డి, ఏఓ రవిప్రకాష్, ఎంపీటీసీ రవి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

నేడు లద్దగిరిలో..

భూసమస్యల పరిష్కారంలో భాగంగా బుధవారం మండలంలోని లద్దగిరి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తెలిపారు. రైతులు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోడుమూరు రూరల్ : గూడూరు నగర పంచాయతీలో ఔట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ డిమాండ్ చేశారు. గూడూరు నగర పంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించి చేస్తున్న సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ, మండల కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్, ఏఐటీయూసీ నాయకులు కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా కృష్ణ మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాలు ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు.

బాలభారతి పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



మాట్లాడుతున్న అనుముల జగదీశ్వరరెడ్డి

ఓర్వకల్లు: పొదుపు లక్ష్మి ఐక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలభారతి పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందజేస్తామని ఎస్ఆర్ఐ ఫౌండేషన్ కర్నూలు జిల్లా చైర్మన్ పాట్లూరి రవి పేర్కొన్నారు. మండల కేంద్రం ఓర్వకల్లు పొదుపు మహిళలు స్థాపించిన బాలభారతి పాఠశాలలో చదువుతున్న తల్లితండ్రులులేని పిల్లల ఆర్థిక సహాయార్థం 'తానా' బోర్డు ఆఫ్ డైరెక్టర్, ఎస్ఆర్ఐ ఫౌండేషన్ కర్నూలు చైర్మన్ పాట్లూరి రవి రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. మండల మహిళా సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు జగదీశ్వరరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి, వ్యాపారవేత్త ముప్పా రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ విద్యార్థుల చదవుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యానందించాలనే లక్ష్యంతో గత ఐదేళ్ల నుంచి యాజమాన్యానికి విరాళాలు అందజేస్తున్నామన్నారు. 2020లో ఇచ్చిన హామీ మేరకు గత ఐదేళ్ల నుంచి సుమారు రూ.55 లక్షలు విరాళంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ ముప్పా, వైస్ ప్రిన్సిపాల్ సవ్య, పొదుపు లక్ష్మి ఐక్య సంఘం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.